క్లుప్తంగా

ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను అభివృద్ధి చేసి మెరుగైన అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి డి.భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసి ఖాళీగా ఉన్న 15 నుంచి 30 సంవత్సరాల్లోపు వయసు ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం అర్హులకు ప్రైవేట్ సంస్థల్లో అవకాశాలు కల్పిస్తామని, పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 8978524022 సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు బౌద్ధారామంలో యోగాంధ్ర


ధాత్రిరెడ్డి, జేసీ

ఏలూరు(మెట్రో): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జూన్ 18న కామవరపుకోట మండలం జీలకరగూడెం, గుంటుపల్లి బౌద్ధరామాల వద్ద ఉదయం 6.30 నుంచి ఉదయం 8 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి వివిధ అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో జేసీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 18న గుంటుపల్లి బౌద్ధరామంలో నిర్వహించే యోగాంధ్రను విజయవంతం చేయాలని కోరారు. రానున్న మూడు రోజుల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు, సచివాలయాల పరిధిలో గుర్తించిన 5,053 వేదికల్లో యోగాభ్యాసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. యోగాంధ్రలో భాగస్వామి అయ్యేందుకు జిల్లాలో ఇంతవరకు 8,60,072 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని జేసీ వివరించారు.

27న పీసీసీ అధ్యక్షురాలి రాక


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 27న ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారని ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. షర్మిల పర్యటన ఏర్పాట్లపై జిల్లాలోని 7 నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పర్యటన విజయవంతానికి తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఏపీసీసీ జనరల్ సెక్రటరీ గౌతు సత్యేంద్ర, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు అమోఘం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బడేటి సత్యసాయి సేవ సంస్థలు ద్వారా సమాజానికి ఎంతో మేలు చేకూరుతోందని, సత్యసాయిబాబా సత్యం, ధర్మం, శాంతి, ప్రేమలను పెంపొందించటానికి ఎంతో కృషిచేశారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర దేశంలో అన్ని ప్రాంతాల్లో కొనసాగుతూ మంగళవారం ఏలూరు చేరుకున్న సందర్భంగా స్థానిక రామకృష్ణాపురంలోని శ్రీ సత్యసాయి సేవా కేంద్రంలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖరరావు, సేవా సంస్థల సభ్యులు ఎం ధర్మారావు, కె.వెంకటేశ్వరరావు, పి.రామారావు, సోడిశెట్టి శాంతకుమార్, జి.రామనాధబాబు, చిన్నం రాజు యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సత్యసాయి గ్రామసేవల్లో భాగంగా ఒక దివ్యాంగునికి వీల్‌చైర్ బహూకరించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

ఏలూరులో వరుసగా దొంగతనాలతో బెంబేలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వరుసగా దొంగతనాలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. తాళం వేసి ఊరు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఇంట్లోని విలువైన వస్తువులకు భద్రత లేకుండా పోతుందని వాపోతున్నారు. ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, రూరల్ ప్రాంతాల ఇళ్లలో చోరీలు దొంగలు పాల్పడుతున్నారు. పగలైనా రాత్రైనా ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి పక్కన ఉన్న వారికి సైతం తెలియకుండా చోరీలకు తెగబడుతున్నారు. ఏలూరు నగరంలో ఈ నెలలోనే ఐదారు చోరీలు చోటుచేసుకోవటం పరిస్థితికి అద్దం పడుతుంది. పోలీసులు దొంగలను పట్టుకుంటున్నా ఫలితం లేకుండా పోతుందని బాధితులు వాపోతున్నారు. నగరంలో రాత్రి వేళల్లోనూ పెద్దగా పోలీస్ నిఘా ఏమీ ఉండడం లేదని పెదవి విరుస్తున్నారు. పైగా రాత్రివేళ గస్తీ బృందాలు కేవలం ప్రధాన రోడ్లపైనే తిరుగుతూ హడావుడి చేయటం మినహా వీధుల్లోకి రావడంలేదని చెబుతున్నారు. ఇటీవల జరిగిన కొన్ని చోరీల వివరాలిలా ఉన్నాయి.

- ఏలూరు వన్‌టౌన్ తూర్పువీధి కల్పనా బేకరీ సమీపంలో బ్రిలియంట్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇంట్లో దొంగలు 60 కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం, పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ వ్యూ (ఫైల్)

- ఏలూరు దక్షిణపువీధి ప్రాంతంలో ఇన్నమూరి భాస్కరరావు తన ఇంటివద్దే కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. పెద్ద తిరుపతి దైవ దర్శనం కోసం వెళ్లిన భాస్కరరావు ఇంటి తాళాలు పగులగొట్టి 15 కాసుల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదును దొంగలు మూడు రోజుల క్రితం అపహరించుకుపోయారు. ఈ మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.
- ఏలూరు రూరల్ ప్రాంతంలోని శివకామాక్షి కాలనీకి చెందిన బాలవలస నాగేశ్వరరావు ఈనెల 4న ఊరు వెళ్లగా, దొంగలు ఆయన ఇంటి తాళాలు పగులగొట్టి అరకిలో వెండి వస్తువులు, ఆరు గ్రాముల బంగారు వస్తువును అపహరించుకుపోయారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ కెమెరాలే కీలకం

ఇటీవల ఏలూరు నగరంలో ఇంట్లో చోరీలు పెరిగిపోవటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసులు ఇంటివద్ద సీసీ కెమెరాలు పెట్టుకోవాలని సూచిస్తున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే సీసీ కెమెరాలు తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చాయనినీ, వాటిని ఏర్పాటు చేసుకోవటం వల్ల చోరీలను అరికట్టడంతోపాటు, ఏదైనా పరిస్థితుల్లో చోరీ జరిగినా వెంటనే దొంగలను పట్టుకుని, ఆస్తిని రికవరీ చేసే అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.


వన్‌టౌన్ ఇంట్లో చోరీ ఘటనను పరిశీలిస్తున్న పోలీసులు

గస్తీ మరింత పటిష్టం



ఏలూరు నగరంలో రాత్రి వేళల్లో గస్తీని మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టాం. ఇళ్లల్లో చోరీలను ఛేదిస్తూ బాధితులకు నష్టపోయిన ఆస్తిని రికవరీ చేస్తున్నాం. ఇక ఇళ్లలో చోరీల నిరోధానికి ఇంటివద్ద, అపార్ట్‌మెంట్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. బంగారు ఆభరణాలు, నగదును ఇంట్లో ఉంచుకోవద్దని, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)ను వినియోగించుకోవాలి. ప్రజలు సహకరిస్తే చోరీలను అరికట్టేందుకు అవకాశం ఉంటుంది.

– డి.శ్రావణ్‌కుమార్, డీఎస్పీ, ఏలూరు

కొల్లేరు ప్రజలకు జీవన భద్రత కల్పించాలి


మోరు రామరాజు

దెందులూరు: సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ కొల్లేరు పరిరక్షణకు, ప్రజల జీవన విధానానికి పూర్తిస్థాయి భద్రత భవిష్యత్తు కల్పించాలని వైఎస్సార్ సీపీ కొల్లేరు బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మోరు రామరాజు అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. జిరాయితీ భూముల రైతులకు జరిగిన నష్టం నేపథ్యంలో 20 ఏళ్ల నుంచి పరిహారం అందజేయాలన్నారు. కొల్లేరులో సాంప్రదాయ వృత్తి చేపల సాగుపై ఆధారపడి ప్రజలు జీవిస్తున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిగణలోకి తీసుకోవాలని కోరారు. పక్షుల జీవనంతో పాటు లక్షలాది మంది కొల్లేరు వాసుల జీవన్మరణ సమస్యగా ఉన్న చాపల సాగు వృత్తిని కాపాడేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గుర్తించిన 70 కాలువలను పటిష్టవంతంగా ఆధునీకరించి, మురుగునీరు దిగువ ప్రాంతానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న కొల్లేరు ఫారెస్ట్ అధికారులు అవలంబిస్తున్న విధానం కొల్లేరు జిరాయితీ రైతులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. కొల్లేరులో మొత్తం 77,000 భూమి ఉండగా అందులో జిరాయితీ భూమి 14,750 ఎకరాలు ఉందని తెలిపారు. సొసైటీ భూములు 10 వేల ఎకరాలు ఉన్నాయని, బి ఫారం పట్టా భూములు సుమారు 5000 ఎకరాలు ఉన్నట్టు చెప్పారు. ప్రభుత్వం పక్షుల కేంద్రానికి పర్యావరణ పరిరక్షణ కోసం ఈ భూముల్లో ఎన్నో చేయవచ్చు, కానీ జిరాయితీ పట్టా రైతుల కొల్లేరుపై పెట్టిన యాక్ట్, జీఓలు రద్దు చేయాలని రామరాజు కోరారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజల కష్టాలు, సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్నారని, ఆయన బాటలో నడుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో మంగళవారం రాత్రి పార్టీ పదవులు దక్కిన నేతలు పలువురు జేపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ కూటమి పార్టీ నేతలు ఎన్నికల ముందు అనేక హామీలు గుప్పించిన నేడు అమలు చేయలేక చతికలపడ్డారని విమర్శించారు. పెన్షన్లు, తల్లికి వందనం డబ్బులు వేసి మొత్తం హామీలన్నీ అమలు చేసేశామని సీఎం చంద్రబాబు చెప్పుకోవటం ప్రజలను మోసం చేయటమే అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పేరు చెబితే దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, అమ్మఒడి పథకం పేరు చెబితే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుకు వస్తారని వివరించారు. ప్రజల జీవన విధానాన్ని మార్చేందుకు జగన్ అనేక సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేసి చూపించారని తెలిపారు. జేపీని కలిసిన వారిలో పార్టీ ఏలూరు నగర కార్యదర్శి మాచర్ల లోకేష్, ఈసీ సభ్యులు గుడివాక మోహన్, తెర్లి లక్ష్మీనారాయణ, బోశెట్టి సోములు, కరణం దుర్గారావు, పోతురాజుల పేరయ్య ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గేదెల సూర్యప్రకాష్, కొల్లిపాక సురేష్, మున్నా, పల్లి వెంకటేశ్వరరావు, పదం రాము, కరణం జగ్గారావు, బండ్లమూడి సునీల్‌కుమార్, సత్తిబాబు, దాకారపు రవి, బంకపల్లి చంటి, గొర్ల దుర్గారావు, జగ్గంపూడి సుబ్బారావు, బోశెట్టి బాలాజీ, కప్పసాయి బాలాజీ, బోశెట్టి సాయి, గుడ్ల సతీష్, పార్టీ నాయకులు ఉన్నారు.



జేపీని మర్యాదపూర్వకంగా కలిసిన మాచర్ల లోకేష్ , జేపీతో పార్టీ నగర ఈసీ సభ్యులు, పార్టీ నేతలు

పాలస్తీనాపై మారణకాండను నిలిపివేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాలిస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తోన్న మారణకాండను తక్షణమే నిలుపుదల చేయాలని, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని ప్రపంచ శాంతిని కాపాడాలని కోరుతూ మంగళవారం ఏలూరులో వామపక్ష పార్టీలు పాలస్తీనా సంఘీభావ దినాన్ని పాటించాయి. రాష్ట్ర స్థాయి వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ), ఎంసీపీఐ (యూ) పార్టీల ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఇజ్రాయిల్ వ్యతిరేకంగా పాలస్తీనాకు సంఘీభావంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ లింగరాజు, సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) జిల్లా నాయకులు కేవీ రమణ, ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మాట్లాడుతూ రెండేళ్లుగా పాలస్తీనాపై అమెరికా ప్రోత్సాహంతో ఇజ్రాయిల్ చేస్తోన్న దాడుల వల్ల సుమారు 60 వేల మంది మరణించడం బాధాకరమన్నారు. ఇరాక్‌పై కూడా ఇజ్రాయిల్ దాడులకు తెగబడ్డదని, అమెరికా తమ ఆయుధాలను విక్రయించుకునే పద్ధతిలోనే ఈ దాడులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ప్రపంచ శాంతిని కోరుకునే భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ చర్యను ఖండించకుండా మౌనంగా ఉండటాన్ని నాయకులు ఖండించారు. ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వ్యతిరేకించాలని, పాలస్తీనాకు ప్రజలు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, సీపీఎం నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, జీవీఎల్ నరసింహారావు, సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) నాయకులు బద్దా వెంకట్రావు, యర్రా శ్రీనివాసరావు, ఎంసీపీఐ (యూ) నాయకులు జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శన చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

కూటమి పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం

ద్వారకాతిరుమల: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో తప్పుడు కేసులు, మోసాలు, అవినీతి, అబద్ధాలు, దాడులు, దోపిడీలు తప్ప ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక పరిపాలనపై వైఎస్సార్ సీపీ ముద్రించిన జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాలను మంగళవారం ఆమె ద్వారకాతిరుమల మండలం కొమ్మర గ్రామంలో పార్టీ నేత తాండ్ర రమేష్ ఇంటి వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ఏడాది పాలన, గత వైఎస్సార్ సీపీ పరిపాలనలో సంక్షేమ పథకాలు అమలు, అభివృద్ధి, సంస్కరణలను బేరీజు వేస్తూ పుస్తకాన్ని ముద్రించినట్టు చెప్పారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్ చేసి, అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వైఎస్సార్ సీపీ నిలదీతలు కారణంగానే తల్లికి వందనం పథకాన్ని షరతులతో అమలు చేశారని తెలిపారు. నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ సాయం ఊసేలేదన్నారు. 19 నుంచి 50 ఏళ్ల వయస్సున్న ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామన్న పథకం, ఉచిత బస్సు ప్రయాణం అమలుకు నోచుకోలేదని విమర్శించారు. తల్లికి వందనం పేరుతో రూ.10 వేల కోట్లు ఇచ్చామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు ఈ ఏడాది రూ.15,500 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజల నెత్తిన మోపిందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పోల్కంపల్లి అనీల్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాకారపు బంగారమ్మ, యాచమనేని నాగేశ్వరరావు, మానుకొండ కన్నయ్య, బసివిరెడ్డి వెంకట్రామయ్య, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, చెలికాని బుల్లియ్య, దాసరి రాంబాబు, షేక్ భాషా, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, మానుకొండ సుబ్బారావు, చెలికాని శ్రీనుబాబు, తాండ్ర గోపాలరావు, తాండ్ర సత్యంబాబు, దాసరి ఏసురత్నం, మానుకొండ ప్రసాద్, నాగేశ్వరరావు, పద్మారావు, వెంకట్రావు, భోగరాజు సాయికృష్ణ, తాండ్ర ఫణికుమార్ (చిన్ని), కొడుదుల ప్రసాద్ తదితరులున్నారు.


జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని విడుదల చేసిన వనిత, నాయకులు

డీఈఎల్‌ఈడీ పరీక్షకు 45 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో మంగళవారం నిర్వహించిన డీఈఎల్‌ఈడీ 4వ సెమిస్టర్ పరీక్షకు 45 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 46 మంది అభ్యర్థులకు ఒకరు గైర్హాజరయ్యారని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

ద్వారకాతిరుమల: భీమడోలులోని స్టేట్ బ్యాంకు ఎదురుగా ద్వారకాతిరుమల మండలం ద్వారకానగర్ పరిధిలో రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీని ఓ వ్యక్తి పూడ్చి వేసి, అక్కడ నిర్మాణాలు చేపట్టడం వివాదాస్పదమైంది. స్థానికుల కథనం ప్రకారం. భీమడోలు జంక్షన్ మీదుగా పారే వర్షపు నీరు, అలాగే ఆ ప్రాంతంలోని ఇళ్లలోంచి వచ్చే వాడకం నీరు, స్టేట్ బ్యాంకు వెనుక ఉన్న కాలనీ నుంచి వచ్చే వాడకం, వర్షపు నీరు ఈ డ్రెయినేజీలోనే కలుస్తాయి. ఆ నీరంతా దిగువ ప్రాంతానికి పారుతుంది. అయితే ఒక వ్యక్తి డ్రెయినేజీని పూడ్చి వేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నాడని, దీంతో వాడకం, వర్షపు నీరు దిగువ ప్రాంతానికి పారే వీలు లేకుండా పోతుందని భీమడోలుకు చెందిన ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శి ముల్లగేరి జాన్సన్ తెలిపారు. వెంటనే ఈ అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దీనిపై పంచాయితీ కార్యదర్శి బాలామణిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.


వివాదాస్పద స్థలంలో పూడుకుపోయిన డ్రెయినేజీ

సంఘాల బలోపేతానికి కృషి


సమావేశంలో పాల్గొన్న కోర్ ఆఫీసర్లు

దెందులూరు: సంఘాల మధ్య నిరంతర సమీక్ష, పర్యవేక్షణతో ఆధ్యాత్మిక అభివృద్ధి బలోపేతం అవుతుందని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు జిల్లా డివిజనల్ కమాండర్ మేజర్ యేసు రాజ్యం లతమ్మ అన్నారు. మంగళవారం ఏలూరు సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని కోర్ ఆఫీసర్లు సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆధ్యాత్మిక అభివృద్ధి, సంఘాల మధ్య ఐక్యత, సమన్వయం, సాల్వేషన్ ఆర్మీ సేవల విస్తరణపై గృహ సమితి యువకులతో సంఘాల వారీగా సమీక్ష చేశారు. సంఘాల కోర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

కామవరపుకోట: వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు అవలంభించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు రైతులకు సూచించారు. మంగళవారం కామవరపుకోట మండలం ఆడమిల్లి, అంకాలంపాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ మాట్లాడారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ ప్రధాన పంటగా వరిలో ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, బీపీటీ 5204 వంటి రకాలను సాగు చేయాలన్నారు. రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వరలక్ష్మి, గంగాధరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరి నారుమళ్లలో జాగ్రత్తలు తప్పనిసరి

చింతలపూడి : వరి నారుమళ్లలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం చింతలపూడి మండలం రాఘవపురం, గణిజెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో మేలైన విత్తనాలను ఎంచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బీజామృతంతో వరి విత్తనాలను శుద్ధి చేసుకోవాలని, అధిక దిగుబడుల కోసం ఎక్కువ రసాయన ఎరువులు, పురుగుమందులు వాడరాదని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. ఉద్యాన శాఖ అధికారి ఫర్హిన్ మాట్లాడుతూ కోకో, కొబ్బరి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శివకుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


కామవరపుకోట : ఆడమిల్లిలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ ముత్యాలరావు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	26
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	10
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

నిడమర్రు: అన్నదాత సుఖీభవకు సంబంధించిన లబ్ధిదారులు త్వరితగతిన ఈకేవైసీ చేయించుకోవాలని నిడమర్రు వ్యవసాయ అధికారిణి ఇంగర్ దైవఆశీర్వాదం అన్నారు. మంగళవారం బువ్వనపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ కౌలు రైతులు రైతుసేవా కేంద్రాల వద్ద సీసీఆర్‌సీ కార్డులను తీసుకోవాలన్నారు. సార్వా సాగుకు పురుగు మందులు తగ్గించి, సేంద్రియ వ్యవసాయం పద్ధతిలో రైతులు సమాయత్తం కావాలన్నారు. ఏఈవో కృష్ణ, వీఏఏలు సాయిబాబా, హనుమంతు, రైతులు సంకు శ్రీను, అలుమోలు అరుణ్, సంకు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దెందులూరు: లైన్ల పునురద్ధరణ నిమిత్తం ఏలూరు రూరల్ మండలం కొక్కిరాయలంక, పైడిచింతపాడు గ్రామాల్లో బుధ, గురువారాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ అంబేద్కర్ తెలిపారు.

జంగారెడ్డిగూడెం సీఐగా సుభాష్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సీఐగా ఎంవీ సుభాష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నిడమర్రు సర్కిల్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సీఐ వి.కృష్ణబాబును వీఆర్‌లో ఉంచారు. సీఐ సుభాష్ మాట్లాడుతూ గంజాయి విక్రయాలు, వినియోగం, ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారిస్తామన్నారు.

ఇంటింటా క్యాన్సర్ సర్వే

దెందులూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే నిర్వహిస్తున్నామని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేష్ అన్నారు. మంగళవారం గోపన్నపాలెం పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వేను ఆయన పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ ప్రతి రోజూ జరిగే ఈ సర్వేలో వైద్య సిబ్బందికి గృహ యజమానులు సహకరించి, వివరాలు తెలియజేయాలని కోరారు. ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ, ఏఎన్ఎం సుభాసినీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంటింటా సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది